
# చేయూత

"ఎసెస్సీతో ఏం ఉద్యోగం దొరుకుతుంది అరుణా! చదువు మానేస్తా అనడం బాగాలేదు" హాస్టల్ మ్యాట్రన్ లలిత సముదాయిస్తూ అంది.

"ఇంటర్ చదివితే మాత్రం ఏం ఉద్యోగం దొరుకుతుంది మేడం?" తమ యింటి ఆర్థిక అశక్తత తెల్సి నిరాశగా అడిగింది అరుణ.

"ఇంటర్ పాసై టీటీసి ట్రెనింగ్ చేస్తే టీచర్ కావచ్చు. పాలేరు పోషయ్య బిడ్డ పంతులమ్మయిందని అందరు అనుకుంటే నీకు, మీ తల్లిదండ్రులకు ఎంత గౌరవం? మీ ఊర్లోనే కొంత కాలం టీచర్‌గా చేసినవంటే మీ కులం పట్ల, మీ కుటుంబం పట్ల ఉన్న చిన్నచూపు పోయి ఎంతో గౌరవం పెరుగుతుంది. నిన్ను అందరు అరుణమేడం, అరుణ టీచర్ అని పిలుస్తుంటే నీకు, మీ వాళ్ళకు ఎంత గౌరవం కలిగిస్తుందో ఆలోచించు" తాను ఉద్యోగం దొరక్కముందు చదువుకోవడానికి పడ్డ కష్టాలను గుర్తుకు తెచ్చుకుంటూ ఓపికగా చెప్తూపోయింది లలిత.



అరుణను పదో తరగతి చదివించడమే తల్లిదండ్రులకు భారమైపోయింది. ఆమె పని చేసి సంపాదించకపోవడమే ఒక పెద్దభారం. నిజానికి అరుణ చదువుకోసం వాళ్ళు ఖర్చుపెట్టింది పెద్దగా ఏమీ లేదు. అరుణ అయిదో తరగతి నుండి ప్రభుత్వ హాస్టల్లో ఉండి చదివింది. చదువు బందు పెట్టిస్తానని తండ్రి అంటే వద్దని ఆ వూరి స్కూలు టీచరు "అమ్మాయి చదువులో బాగుంద"ని ఒప్పించి పూనుకొని హాస్టల్‌లో చేర్పించాడు. ఇప్పుడు ఎసెస్సీ సెకండు క్లాసులో పాసైంది. హాస్టల్లో మూడు పూటలా భోజనంతో పాటు పుస్తకాలు, నోటుబుక్కులు, ఏడాదికి రెండు డ్రస్సులు, నెలనెలా సబ్బులు, నూనెలు, పరుచుకునే దుప్పట్లు, ప్లేటు, పెట్టెలు కూడా ఉచితంగాయిచ్చారు.

అరుణ తల్లిదండ్రులు ఏటా ఒక డ్రెస్సు కుట్టించడం, నెలకు అయిదు, పది చిల్లరకు సర్దడం తప్ప పెద్దగా ఖర్చు చేసిందేమీ లేదు. కానీ కాలేజీ చదువంటే మాటలా? కాలేజీ హాస్టలు లేదు. యూనివర్శిటీ హాస్టల్లను ఉంచి, డిగ్రీ, జూనియర్ కాలేజీ హాస్టల్లను తెలుగుదేశం ప్రభుత్వం 1986 నుండి ఎందుకు రద్దుచేసిందో! కాలేజీ చేయాలంటే రూం కిరాయకు తీసుకోవాలి. సొంతంగా వంట చేసుకోవాలి. ఖర్చులన్నీ స్వంతంగా పెట్టుకుంటే ఎప్పుడో ఫిబ్రవరి మార్చి నెలలో స్కాలర్‌షిప్ వస్తుంది. అది సగం ఖర్చులకైనా చాలదు. అంతదాకా పెట్టుబడెక్కన్నుంచి తేవడం... వేల రూపాయలు అప్పు ఎవరిస్తారు. వాటిని తీర్చడం ఎలా? తల్లిదండ్రుల్తో అరుణ వాదన పెట్టుకొని ఓడిపోయి ఏడ్చేసింది.

"నీతోటి సరవ్వకు పెండ్లయిపాయె. నువ్వు సదువుతానంటే ఎట్లనె. ఇంట్ల ఎట్ల ఎల్లది?"

"నాయినా! ఎట్లన్న అర్నెల్లు కష్టపడుండ్రి. స్కాలర్‌షిప్ వస్తది. నేను ఉద్యోగం సంపాయించి తమ్ముణ్ని బాగ చదివిస్తనే"

"మనిండ్లల్ల ఆడపిల్లగాన్లు నీ అంత గూడ ఎవలు సదువలే. వాల్లకు లేకనా? మనం సదువుకుంటె ఊర్లె ఎవలూ ఓర్వరు బిడ్డా!" పోషయ్యను ఆర్థిక భారం కన్నా సాంఘిక భారం, సాంస్కృతిక అణచివేత కుంగదీసి వెనక్కి గుంజుతున్నది.

అరుణ వాదించి ఓడిపోయి ఏడ్చేసింది. తల్లి రాజవ్వ కూడా కన్నీళ్ళు పెట్టుకుంది. తండ్రి పొలం పనికి వెళ్ళాడు. కాలేజీకి అప్లయి చేసే డేటు రేపటికి అయిపోతుంది. అరుణ ఎటూ తోచక తమ పల్లె నుండి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న తాలూకా సెంటర్‌కు హాస్టల్ మ్యాట్రన్‌ను కలుస్తానని బయల్దేరింది.

"అరుణా! మీ నాన్నతో నేను మాట్లాడుత. నువు తప్పక కాలేజీ చదువాలె. ఫీజు నేనిస్త. నీకు రూం దొరికే దాకా నాతోనే ఉండు. నీ కోసం చిల్లర ఖర్చులైనా పెట్టుకోలేనా?" అంది లలిత నిష్ఠూరంగా.

మొహమాటంతో "అది కాదు మేడం!..." అంటూ నాన్న చెప్పిన మాటల్నే తన వాదనగా విన్పించబోయింది అరుణ.

"వద్దురా.. అవన్నీ నాకు చెప్పకు. నువ్వు కనీసం టీటీసి చేసి టీచరైనా కావాలి.

లేదా నువ్వున్న ఈ హాస్టల్‌కు మ్యాట్రన్‌వై హాస్టల్‌ను గొప్ప ఆదర్శ హాస్టల్‌గా తీర్చిదిద్ది పేరుపొందాలి...”

“టీచర్ పని ఫర్లేదుగానీ ఈ హాస్టల్ మ్యాట్రన్ ఉద్యోగం మాత్రం అసలే చేయను మేడం.”

“ఎందుకురా?” భుజం మీద చెయ్యేసి ప్రేమగా నిమురుతూ అడిగింది లలిత.

ఆరేళ్ళు హాస్టల్‌లో ఉండి చదువుకున్న అరుణకు మ్యాట్రన్‌ల కష్టాలేమిటో తెల్సు. ఏ డిపార్టుమెంటు ఆఫీసరు ఎప్పుడు హాస్టల్ చెకింగ్‌కు వస్తాడో తెలియదు. వాళ్ళు వస్తారని తెల్సిన్నించి వచ్చి వెళ్ళిపోయే దాకా వణికిపోతుంది మేడం. అన్నీ బాగానే ఉన్నాయని చెప్పమని పిల్లల్ని బతిమాలుతుంది. కన్నీళ్ళు పెట్టుకుంటుంది. స్టోర్‌రూంలో ఎక్కువ తక్కువలున్న సరుకుల్ని తీసివేరే దాచి పెట్టిస్తుంది. ఆఫీసుకు బిల్స్ పాస్ కోసం పోయినప్పుడల్లా లంచాల కోసం అందరూ పీడిస్తారని ఎన్నిసార్లు ఏడ్చిందో మేడం. ఆఫీసులో వాళ్ళు ఎన్ని వంకరచూపులు చూస్తారో... ఎన్ని రకాలుగా గోసపోసుకుంటారో... ఏ యిద్దరు మేడంలు కల్సినా అవే విషయాలు... ఇటు ఏవేవో విద్యార్థి సంఘాలని, అటు రాజకీయ నాయకులని ఇది సరిగ్గాలేదని, అది సరిగ్గా లేదని పిల్లలను ఎగదోలి, బెదిరించి చందాలో, వాళ్ళ మీటింగులకు బియ్యం, చిల్లర సామానో, పిల్లల్నో పట్టుకపోతరు. అన్నిట్లో మేడం తరఫున మాట్లాడి కాపాడుకుంటూ వస్తే లలితకు అరుణంటే ఎంతో అభిమానం. అరుణను సొంత చెల్లెలుగా చూసుకునేది. బడి ఎగ్గొట్టి రెండ్రోజులు రైసుమిల్లులో పనికి పోయిందని తెల్సి లలిత చీవాట్లేస్తే డ్రెస్సులు లేవని ఏడ్చేసింది అరుణ. తాను కూడా చిన్నప్పుడు యిలాగే బడి ఎగ్గొట్టి అమ్మతో కూలికిపోయింది గుర్తొచ్చి అరుణను అక్కున చేర్చుకుంది. మిగతా విద్యార్థినులకు తెలియకుండా యేటా ఒకటి రెండు డ్రెస్సులు కుట్టించేది మేడం.

ఎవరో అధికారి కొంతకాలం మేడం కోసం వచ్చిపోతుండేవాడు. మేడం ఆఫీసుకు వెళ్తున్నానంటూ వెళ్ళేది. ఆ అధికారి బదిలీ అయిపోయాక ఆ పీడ వదిలిపోయింది. ఇవన్నీ ఏకరవు పెట్టి మేడం మనస్సు నొప్పించడం అరుణకు ఇష్టం లేకపోయింది. ముక్తసరిగా నవ్వుతూ అంది అరుణ.

“మీ కష్టాలు చూస్తలేనా మేడం. అసలు ఈ ఉద్యోగానికి రిజైన్ చేస్తేంది మేడం? ఏదైనా ప్రయివేట్ స్కూల్లో చెయ్యిన్రి. లేదా మీరే ఓ స్కూలు పెట్టున్రి. నేను గూడ పని చేస్త. అట్ల ప్రయివేట్‌గ యింటర్ రాస్త”

లలిత నిట్టూర్చింది. చిన్నపిల్లయినా అరుణకు తన జీవిత వివరాలన్నీ తెల్సు. బీఎస్సీ చేసిన భర్తకు ఏ ఉద్యోగం రాలేదు. సేల్సు రిప్రజెంటేటివ్‌గా పని చేస్తుంటాడు. అది కూడా మూడుసార్లు కంపెనీలు మారాడు. ఇంటికేమీ యివ్వడు. ఇంకెవర్నో బయట సెటప్ పెట్టుకున్నాడని వినికిడి. అడిగితే గుట్టురట్టయి ఉన్న కాస్త భయం తెలిపోతుందని తెలియనట్టే ఉండిపోయింది. ముగ్గురు పిల్లలయ్యారు. తండ్రి బీడీ కంపెనీలో గుమస్తా. వెనకా ముందు ఆధారం లేని జీవితం. ఉద్యోగం ఒక్కటే ఈ బతుక్కి ఆసరా... ఆ

ఉద్యోగం యిలాంటిది. ఒక్క పైసా లంచం లేకుండా ఏ పైరవీ లేకుండా, దొరికే ఈ ఉద్యోగానికి కాంపిటేషన్ లేకుండా దొరికినందుకు చాలా సంతోషించింది. కాంపిటేషన్ ఎందుకు లేదో... ఇపుడర్థమైపోయింది. ఉద్యోగం ఊరకే దొరికిన సంతోషం ఎంతో కాలం నిలవలేదు.

"అరుణా! ఈ ఉద్యోగం ఉండగానే బతుకుడు కష్టంగా ఉన్నది. ఉద్యోగం వదిలేస్తే ఎలా...? అయినా నాకు తొందర్లోనే అసిస్టెంటు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ప్రమోషన్ రావచ్చు. అంతదాకా ఓపిక పడ్తేచాలు" అంది లలిత.

"చాలా సంతోషం మేడం. మీరు ఎ.ఎస్.డబ్ల్యు.ఒ. అయితే నేను మీరన్నట్టు మ్యాట్రన్ ఉద్యోగం చేస్తా..."

"వద్దురా... ఏదో మాటవరుసకన్నాను గానీ అందరూ మన తీరుగ ఉంటరా! నువ్వన్నట్టు నిత్యం వణికే ఈ ఉద్యోగం చేయొద్దు. వణికి వణికి రాణిమేడంకు పర్మనెంటుగా ఫిట్స్ రోగం వచ్చేసె." నిట్టూర్చింది లలిత.

మాటల్లోనే వంటయిపోయింది. ఇద్దరూ భోంచేశారు.

"మేడం! నేను స్కూల్లో టీచర్లను ఓసారి కల్సి వస్త" అంటూ లేచింది.

"అట్లనే కాలేజీకి పోయి అప్లికేషన్‌ఫారం తీసుకచ్చుకో..." అంటూ డబ్బులివ్వబోయింది లలిత.

"వద్దు మేడం. ఇంట్లో నాయినతోని యిప్పటికే పెద్ద కొట్లాటయింది. రిజల్ట్ రాకముందే సెలవుల్లో నాన్న నాకో సంబంధం తెచ్చిండు. నేను ఏడ్చిన. నేను పిలగాన్ని మెచ్చుకపోతే వాల్లు ఎల్లిపోయిన్రు"

"ఎట్లరా అరుణా! నా బాధ మీకు అర్థమైతలేదు. మీ కులంలో వందమందిలో నువ్వొక్కదానివి టెన్త్ దాక వచ్చినవు. హాస్టల్ల పదిమంది రాస్తే నలుగురే పాసైరి. సెకండుక్లాసు వచ్చిన నువ్వు కూడా చదువు మానేస్తే ఈ రిజర్వేషన్లు ఎందుకు... ఎవరికి? రిజర్వేషన్ సౌకర్యాలున్నా ఉపయోగించుకోకపోతే ఎట్లా...? విద్యను, ప్రభుత్వ శాఖలను ప్రైవేటీకరిస్తున్నారు. డబ్బున్నోల్లు తప్ప పేదలు చదువుకోలేని దశ రాబోతున్నది. అసలే తక్కువైన ప్రభుత్వోద్యోగాలు ఇంకా తగ్గిపోతున్నాయి. రేపెట్లుంటుందో తెలియదు. ఇప్పుడున్న అవకాశాలనైనా పొందకపోతే ఎలా? నువ్వు ఒక్క యింటర్ దాటురా! నీకు ఉజ్వల భవిష్యత్తుంది... ఇంటర్ దాటితే ఎమ్మే దాకా చదువుకుంటు పోవచ్చు. ఏవో స్కాలర్‌షిప్పులు రానేవస్తయి. కనీసం టీచరైనా కాకపోతే ఎట్ల?"

"నాకు ఈ పెద్దకులపోల్లతోని కల్సి చదవుడంటెనే భయం మేడం. ఏదేదో అని కించపరుస్తరు. ఈ పెద్దకులపు టీచర్లతోని – పెద్ద కులపు పిలగాన్లకు చదువు చెప్పుడంటే గూడ నాకు భయమే మేడం..."

"అట్లా అని చదువు మానేస్తవ? ఈ భయాలన్ని ఓ ఏడాది పాతపడేదాక ఉంటయి.

ఆ తర్వాత హాస్టల్లో లీడరైనట్టే నువ్వే మిగతా టీచర్లకు లీడర్వైతవు. డిస్ట్రిక్ట్ టోర్నమెంట్స్‌లో రన్నర్ టీమ్‌గా వచ్చినా పీటీలందరు బెస్ట్ కాప్టెన్ అని నిన్ను మెచ్చుకోలేదా? అరుణా! ఒక్కటి గుర్తుంచుకో. భయపడితే భయపెడ్తరు. లోకాన్ని చూసి భయపడవద్దు. లోకం కూడా హాస్టల్ వంటిదే. ఆరెండ్ల నీ హాస్టల్ అనుభవాలు లోకాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడ్తయి. ఇక్కడే కాదు. ఎక్కడైనా మంచీచెడ్డ అన్నీ కలగల్సే ఉంటయిరా!" ధైర్యం చెప్పి బలవంతంగా డబ్బుల్ని అరుణ చేతిలో కుక్కింది లలిత.

అరుణ వెళ్ళిపోయాక అటుకేసి చూస్తూ ఆలోచనల్లో పడిపోయింది లలిత. ఎందుకో అరుణలో తన చిన్ననాటి బాల్యం కన్పిస్తోంది. తనకపుడు కనీసం యిలా మాట మద్దతు యిచ్చేవారైనా లేరు. ఏ స్కాలర్‌షిప్‌లు ఎలా వస్తాయో, ఏ చదువు చదివితే ఏ ఉద్యోగాలు వస్తాయో చెప్పేవారు లేరు. ఒక్కరైనా చెప్పేవారుంటే తాను యింకా చదివి ఈపాటికి యూనివర్శిటీ లెక్చరర్ అయి వుండేది. అందీఅందని ఆసరాతో రేపు అరుణ బతుకు కూడా తనలాగే గెలిచి ఓడిన నిస్సారమైన బతకవుతుందా? తన స్నేహితులు 'నీబతుక్కేమైందే... హాయిగా నెలనెలా జీతం తీసుకొంటున్నావు... మేం సినిమాకు పోవాలన్నా భర్తలను అడుక్కోవాల్సిన దుస్థితి' తనకేమో భర్త ఉద్యోగం చేస్తుంటే వాళ్ళలాగా వంట చేస్తూ ఇంటి పట్టున ఉండాలని. వీళ్లకేమో నేను బాగా బతుకు తున్నానని.

"మేడం మీ కోసం ఎవరో వచ్చిన్రు. హాస్టల్ల ఉన్నరు. హాస్టల్ల అడ్మిషన్ కోసం పిల్లలను తీసుకొని వచ్చిన్రు" అంటూ హాస్టల్ వాచ్‌మన్ రావడంతో రెడీ అయి బయల్దేరింది లలిత.

రాత్రి ఎనిమిదింటికి లలిత యింటికి వచ్చాడు పోషయ్య. అరుణ ఫ్రెండ్సుతో కల్సి సిన్మాకెళ్ళింది. లలిత యింకా హాస్టల్ నుండి రాలేదు. కాసేపు చూసి హాస్టల్‌కేసి నడిచాడు పోషయ్య.

యూనివర్శిటీ హాస్టల్‌లా అందంగా ప్రశాంతంగా ఉంది హాస్టల్. హాస్టల్ చుట్టూరా, లోపలా బిల్డింగ్‌పైకి ఎదిగి విచ్చుకున్న చెట్లు. పిల్లలతో ఏదో మాట్లాడుతోంది లలిత. నమస్కరించి నిలబడి పోయాడు పోషయ్య. తొమ్మిదవుతుండగా పోషయ్యను తీసికొని యింటికేసి నడిచింది లలిత.

"అరుణ ఇంట్ల చెప్పక చెయ్యక ఎటో పోయింది. మీ దగ్గరికి వచ్చిందా మేడం" ఆదుర్దాగా అడిగాడు పోషయ్య.

"ఇంట్ల ఏమన్న కొట్లాడుకున్నరా!" అడిగింది లలిత.


పోషయ్య కథంతా చెప్పుకొచ్చాడు. ఎంత చదివితే అంతకన్నా ఎక్వ చదివినవాన్ని వెతికి కట్నం పోసుడు తనతో కాదన్నాడు.

"కట్నం లేకుంట పెళ్ళి చేసుకునెటోల్లు దొరకరా! కట్నం అడగని పిలగాన్ని నేనెక్కడున్నా జాడదీసి పెళ్ళి చేస్త. కులాంతర వివాహం చేసుకుంటే గవర్నమెంటు

పదివేలిస్తది. ఏదన్నా పెట్టుకోవడానికి లక్ష లోను గూడ ఇస్తది. అరుణను చదివించు. ఫీజులు నేనే గడ్త. కొంతకాలం నా యింట్లనే నాతోనే ఉంటది. ఏమంటవు...?" సముదాయించింది లలిత.

కూతుర్ని దబాయించి ఒప్పించినట్టు మేడంను ఒప్పించడం తనతో ఎలా అవుతుందని మౌనం వహించాడు పోషయ్య.

తాళం తీసి వంటగదిలోకి నడిచింది లలిత. వంట పూర్తయ్యేసరికి అరుణ వచ్చేసింది. తండ్రిని చూసి బయటే నక్కింది.



"మీరన్నట్టే కానీ మేడం" అన్నాడు పోషయ్య.

ఆ మాట చల్లగా విన్పించి మెల్లగా యింట్లోకి నడిచింది అరుణ.

అయిదేళ్ళు గడిచాయి. లలిత యిపుడు అసిస్టెంటు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పని చేస్తోంది. అరుణ టీచర్‌గా చేరి ఏడాదైపోయింది. అరుణ తమ్ముడు యింటర్లో చేరాడు. కూతురు కాస్త సంపాదించడంతో పెళ్ళి మాట అడగడం మానేశారు తల్లిదండ్రులు. ఎంసెట్ ర్యాంకు వచ్చినా తనకు చేయూతనిచ్చేవారు లేక, కౌన్సిలింగ్‌కు ఎలా వెళ్ళాలో తెలీక మంచి యింజనీరింగ్ సీటు తప్పిపోయిందని అరుణకు లోలోన బాధ తొలుస్తోంది. ప్రమోషన్ యిచ్చి వేరే జిల్లాకు లలిత మేడంను బదిలీ చేయడంతో ఆసరా లేకుంటైపోయింది. ఈ మధ్యే తిరిగి పాత జిల్లాకు బదిలీ అయింది.

ఇంటర్ క్యాస్టు మ్యారేజీ చేసికొన్న దంపతులకు ప్రోత్సాహకంగా యిచ్చే పదివేల రూపాయలు సాంక్షన్ చేసే ముందు వారి కులం సర్టిఫికెటును, ఫిజికల్ వెరిఫికేషన్‌ను చేయడం కోసం అరుణ పని చేస్తున్న ఊరుకు వెళ్ళింది లలిత. వచ్చిన పని పూర్తి

చేసికొని అరుణ పని చేసే స్కూలుకేసి నడిచింది లలిత. క్లాసురూంలోంచి అరుణ గొంతు వినపడింది.

"ప్రవీణ్ లేచి నిలబడు. రవిని ఎందుకేడ్పించినవో చెప్పు" అరుణ అడుగుతోంది.

"నీకన్న ఎక్కువ మార్కులు తెచ్చుకుంట అని రవి అన్నడట మేడం. ఏ.. వెవ్వెవ్వే అని వెక్కిరిస్తే ఉట్టిగనే ఏడ్చిండు మేడం" అంటూ ప్రవీణ్ పక్కనున్న విద్యార్థి లేచి చెప్పాడు.

"రవీ, స్టాండప్. వేణు చెప్పింది నిజమేనా?" అడిగింది అరుణ.

ఔనంటూ తలూపి కళ్ళు తుడుచుకున్నాడు రవి.

"ప్రవీణ్! నువ్వు యింట్లో ఏమేం పని చేస్తావు? పెండదీయడం, అంట్లు తోమడం, బోరింగ్ కాన్నుంచి నీళ్లు దేవడం, ఆదివారం కూలి పనికి పోవడం ఇంటి కాడ కూరగాయల చెట్లు పెంచడం.. యిలా ఏమేం పనులు చేస్తవ్?"

"వీడు యింట్ల ఒక్క పని చెయ్యడు మేడమ్" అన్నాడు పక్క విద్యార్థి ఉత్సాహంగా.

"మరి రవి చూడు! యివన్ని పనులు చేస్తడు. వాల్ల నాన్న వేరే ఊర్లో జీతం ఉన్నడు. మీ నాన్న ఊర్లోనే ఉన్నడు. ఏమైన డౌట్సు వస్తే మీ నాన్న చెప్తడు. మీ యింట్లో ఫ్యాను, ట్యూబ్‌లైటుంది. వాల్లింట్లో కరెంటు లేదు. కమ్మల గుడిసె. ఇన్ని అసౌకర్యాల్లో కూడా అరవై రెండు శాతం మార్కులు తెచ్చుకోవడం గొప్పా? అన్ని సౌకర్యాలున్న ప్రవీణ్ అరవై తొమ్మిది శాతం మార్కులు తెచ్చుకోవడం గొప్పా? చెప్పండి" ఆర్ద్రంగా ఉంది అరుణ గొంతు. ఎంత చక్కని విశ్లేషణ అని మనసులో మెచ్చుకుంది లలిత.

క్లాసంతా కాసేపు నిశ్శబ్దమైపోయింది.

"రవే గొప్ప మేడం..." ఎవరో అనడంతో "గుడ్" అంది అరుణ. క్లాసురూం చప్పట్లతో మార్మోగిపోయింది. రవి మొహం ఆనందంతో వెలిగిపోయింది.

లలిత రావడంతో పిల్లలందరు లేచి 'నమస్కారం' చెప్పారు. తమ మ్యాట్రిన్ అని, ప్రస్తుతం పని చేస్తున్న హోదా వివరించింది అరుణ.

పిల్లల్ని కాసేపు నిశ్శబ్దంగా కూర్చోమని చెప్పి స్టాఫ్‌రూంకేసి నడిచింది అరుణ.

అవీయివీ మాట్లాడుకున్నాక లలిత అరుణను ప్రశంసించింది.

"అరుణా! నీలో నాకు సావిత్రిబాయిపూలే కన్పించింది".

"ఆమె ఎవరు మేడం"

"ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా టీచరు. మహాత్మాజ్యోతిబా పూలే సతీమణి. నీలా పేదరికం నుండి పైకొచ్చింది. నాక్కూడా ఆమె గురించి ఈ మధ్యే తెల్సింది".

"అయితే ఆమె గురించి తప్పకుండా తప్పక తెల్సుకోవాలి" అంది అరుణ.

"ఈ ఊళ్ళో ఉద్యోగ జీవితం ఎలా ఉంది, అరుణా!"

"చాలా ఆనందంగా ఉంది మేడం. టీచర్ ఉద్యోగంలో యింత తృప్తి, జాబ్ సాటిస్‌ఫాక్షన్ ఉంటుందని టీచర్ అయ్యాకే తెల్సింది. ఇంజనీర్ కాలేకపోయాననే చింత తగ్గుతోంది. మీ వల్ల టీచరునయ్యాను. అదే సంతోషం. ఇక్కడి లేడీ సర్పంచ్ ఎల్లమ్మ చాలా మంచిది. ఎంతో సహకరిస్తుంది. ఆమె యిప్పటికీ కూలిపనికి పోతుంది. తెల్సా మేడం?" ఉత్సాహంగా అంది అరుణ.

"అంత సిన్సియర్ అన్నమాట. సరేగానీ నీ పెళ్ళి సంగతి ఏం చేశావు? పిలగాన్ని చూడనా?"

"ఇపుడే వద్దు మేడం. ఈంత ఎమ్మే అయినంక చూస్త. తమ్ముని చదువైపోవాలె. వానికేదైన జాబ్ దొరకాలె. అపుడు ఆలోచిస్త మేడం"

"ఇంకా ఏం విశేషాలు.. చెప్పు"

"మేడం! కనీసం హాస్టల్‌కు కూడా పంపించలేని పేద తల్లిదండ్రులు ఎందరో ఉన్నరు. వాళ్ళకు ఏ ఆసరా లేక అలాగే మగ్గిపోతున్నరు. వాళ్ళలో కూడా ఆశ కలిగించాలె. ఆసరా యివ్వాలె. అలాంటి ఆడపిల్లలకు మూడో తరగతి నుండి యాడాదికి 45 రూపాయలే స్కాలర్‌షిప్ ఇస్తున్నరు. కాగితాలకు సర్టిఫికెట్లకు అంతకన్నా ఎక్వ ఖర్చయితయి మేడం. ఇరవై ఏండ్ల నుంచి 45 రూపాయలే యిస్తున్నరు. కనీసం అది అయిదు వందమైనా చెయ్యాలె మేడం. గుజరాత్‌లో హైస్కూలుకెళ్లే ఆడపిల్లలకు సైకిళ్ళు ఉచితంగా యిచ్చిందట ప్రభుత్వం. ఇక్కడ కూడా యివ్వాలని పై అధికారుల దృష్టికి తీసికెళ్ళండి మేడం"


"తప్పకుండా! ఇంకా మీ ఊరి విశేషాలేమిటి?"

"ఇపుడు మా వూళ్లో మా వాడ నుంచి పది మంది ఆడపిల్లలు టెన్త్ చదువుతున్నరు మేడం"

"గుడ్. వాళ్ళకు నువ్వే ఇన్స్పిరేషన్ అనుకుంట" అంది మేడమ్.

అరుణ నవ్వింది.

"అయితే వాళ్ళకు నీలాంటి వాళ్ళ కష్టం తప్పింది. ఆడపిల్లల కోసం ప్రభుత్వం కాలేజీ హాస్టల్స్‌ను మళ్లీ స్టార్ట్ చేసింది. వాళ్లకు చెప్పు. మొత్తానికి నువ్వు చాలా ఎదిగిపోయావు" అని అంది మేడం. కానీ ఆమె మనసులో మరో వైపు నిరాశ పీకుతోంది. ప్రభుత్వోద్యోగాలు తగ్గిపోతున్నాయి. ఆర్టీసీని, కరెంట్‌ను కూడా ప్రయివేటువారి చేతుల్లో పెడుతున్నారు. దళితులకు స్వాతంత్ర్యం తర్వాత వచ్చిన ఈ కాస్త ఉద్యోగాలు, జీవిత భద్రత రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. ఈ మాట ఇప్పుడే చెప్తే దళితులు ఉత్సాహంగా ఈ మాత్రమైనా చదువుకోగలరా? ఏమో, ఎవరికి తెలుసు పోటీ ప్రపంచంలో ఓసిల కన్నా వీళ్లే ముందుకెళ్లి గెలుచుకోవచ్చునేమో. ఇప్పుడు అమెరికా కన్నా భారతదేశ




ఇంజనీర్లదే, కంప్యూటర్ సంస్థలదే పైచేయి కాలేదా? అనుకుని ఆగిపోయింది.

అరుణ మళ్లీ అంది – "మేడం! జాబ్ సాటిస్‌ఫాక్షన్, ఉద్యోగ భద్రత గొప్ప ఆత్మవిశ్వాసాన్నిస్తుంది. అల్లుకునే తీగకు కాస్త ఆధారం దొరికితే ఆశ ఉంటుంది. ఆత్మవిశ్వాసం ఉంటుంది. జీవితం పట్ల లక్ష్యం ఏర్పడుతుంది. అపుడు ఏదైనా అందుకోవడం సాధ్యం కదా, మేడం!"

అరుణ మేడంవాళ్ళ సార్ గురించి పదే పదే అడిగింది.

లలితకు అరుణ మాటల్లో కొత్త అర్థాలు స్ఫురించాయి. అరుణను తల్లిలా కౌగలించుకొని కన్నీళ్ళతో గుప్పెట విప్పింది లలిత.

"ఆయన యిపుడు పూర్తిగా దాంతోనే ఉంటున్నడు. విడాకులు తీసుకుందామనుకున్న. ఇప్పుడా ఆలోచన విరమించుకుంటున్న. ఈ వయస్సులో విడాకులెందుకు... చెప్పు అరుణా! నువ్వేమంటవు?"

అరుణ మౌనంగా ఉండిపోయింది. మేడంకు ప్రమోషన్ వచ్చినా జీవితంలో తృప్తి, ఆనందం లేకుండా పోయిందని బాధపడింది అరుణ.

"నేను అసలు పెళ్లి చేసుకోను, మేడం! పేద పిల్లలకు సేవ చేయడం కోసం

నేను నా జీవితాన్ని అంకితం చేస్త. ఉద్యోగానికి రిజైన్ చేసి ప్రైవేట్ స్కూలు పెట్టి తక్కువ ఫీజులతో దళితుల పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దుతా. మీ ఆశీస్సులు కావాలె, మేడం! కొంత పెట్టుబడి మీరు పెట్టగలరా?"

ఆ మాటతో తనలోని నిరాశకు గల స్వార్థపు మూలాన్ని కొరడాతో కొట్టినట్టు ఉలిక్కిపడింది లలిత. ఈ నిరాశకు కారణం తన ఆలోచనాతీరులోనే ఉందా అని ఆశ్చర్యపోయింది. కళ్లు తుడుచుకొని తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో అంది లలిత.

"తప్పురా! నాకేదో జరిగిందని నువ్విలా అనుకోవడం తప్పు" అంటూ అరుణ తలను ప్రేమగా నిమిరింది. తమను గురువుగా భావించి స్ఫూర్తి పొందేవారి ఎదుట గురువులు తమ వైఫల్యాలు, విషాదాలు చెప్పుకోకూడదు. ప్రైవేటీకరణ వల్ల గ్లోబలైజేషన్ వల్ల జరిగే నష్టాలను చెప్పి గెలుచుకొనే జీవితం పట్ల కూడా నిరాశ పెంచి ఓటమిపాలు చేయకూడదు. వైఫల్యాలను సాఫల్యాల్లో, విజయాల్లో భాగంగా ఉత్తేజం కలిగించడంలో భాగంగా చెప్పాలే తప్ప నిరాశను పంచకూడదు. ఎంత నిరాశలోను ఆశను ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని పంచుతూ ఉండాలి. అనుకుని మళ్ళీ అంది లలిత.

"పిల్లలు బాగా చదువుతున్నరు. నిన్ను అక్కా అంటూ బాగా జ్ఞాపకం చేస్తున్నరు" అని కాసేపు అదీ ఇదీ మాట్లాడి "మళ్ళీ కలుద్దాం" అంటూ లేవబోయింది లలిత.

స్కూలు అయిపోయినట్టుగా బెల్ మోగింది.

"ఈ రోజు మీరు ఇక్కడే ఉండండి మేడం!" అంటూ స్టాఫ్‌రూంలోంచి బయటకు నడిచింది అరుణ.

అరుణ చుట్టూ ఆనందంగా తల్లికోడిని చేరిన కోడిపిల్లల్లా గుమిగూడారు స్కూలు పిల్లలు. స్వచ్ఛమైన పూవుల్లాంటి వాళ్ళ పలకరింపుల్తో లలితలోనూ కొత్త ఉత్సాహం, కొత్త ఆనందం వెల్లివిరిశాయి.

ఆ రాత్రి అక్కడే ఉండిపోయింది లలిత. పదిహేను మంది పిల్లలు అన్నాలుతిని చదువుకోవడానికి అరుణ ఇంటికి పరిగెత్తుకొచ్చారు. పడుకునే ముందు కథ చెప్పాలి మేడం అంటూ గోలచేస్తే సింద్‌బాద్ నావికుడి సాహసయాత్రలో ఒకటి చెప్పింది అరుణ. తండ్రిని కోల్పోయిన భక్త ధృవుడి జీవితాన్ని ఎలా గెలుచుకున్నాడో కొత్త కోణంలో కొత్త కథను చెప్పింది ఆమె. అది వింటుంటే పిల్లల కళ్ళలో గొప్ప వెలుగు.

అరుణ నుండి నేర్చుకోవాల్సిందెంతో ఉందనుకుంది లలిత. "రాబిన్‌సన్ క్రూసో కథ మళ్లీ చెప్పండి మేడం" అని పిల్లలు అంటుంటే "మరోసారి చెప్తగని మేడం వచ్చింది. మేడంను ఓ కథ చెప్పమనండి" అంది అరుణ.

"అంబేద్కర్ గురించి చెప్తూ మ్యాదరి బాగయ్య అనే బాగ్యరెడ్డి వర్మ గురించి అరుణ మేడం కొద్దిగనే చెప్పింది. మేదరి బాగయ్య దాదాపు నూరేళ్ల కిందనే దళితుల కోసం స్కూల్లు పెట్టి సంఘసంస్కరణ నడిపి నిజాం రాజ్యంలో గొప్ప సంఘ సంస్కర్తగా

పేరు పొందాడట కదా, అతని గురించి ఇంకా వినాలనుంది. చెప్పండి మేడం" అంటూ లలిత మేడమ్‌ను గోలగా అడిగారు.

మేదరి బాగయ్యను, అతను నడిపిన ఆది హిందూ ఉద్యమాన్ని అంతా గుర్తు చేసుకొని చెప్తుంటే తనలో గొప్ప ఉత్సాహం. వింటూ వింటూ నిద్రపోయారు పిల్లలు. ఇప్పుడు లలితకు తన ముందున్న కర్తవ్యమేమిటో పిల్లలు గుర్తు చేసినట్టనిపించి తనలోని ఖాళీ ఏదో పూరించబడ్డట్టయి చాలా కాలం తర్వాత తృప్తిగా, ఆనందంగా నిద్రపోయింది లలిత.

**- ఆదివారం వార్త, 8 ఆక్టోబర్ 2000**